


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శుక్రవారం
04-04-2025
పేజీలు: 02



# డోజ్ నుంచి మస్క్ ఔట్..
# ట్రంప్ సంచలన నిర్ణయం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగంలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం కోసం ట్రంప్ ఏర్పాటు చేసిన డోజ్ బాధ్యతల నుంచి ఎలాన్ మస్క్ తప్పుకోనున్నట్టు సమాచారం. మే చివరి లేదా జూన్ మొదటి వారంలో పదవి నుంచి మస్క్ వైదొలగనున్నారు. మస్క్ నేతృత్వంలోని డోజ్ పనితీరుపై తీవ్ర విమర్శలు రావడంతో ఆయనను తప్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వంలో అనేక సంస్కరణలు, మార్పులు తీసుకొచ్చారు. అందులో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (DOGE) విభాగాన్ని ఆయన ఏర్పాటు చేశారు. ఈ విభాగానికి ఎలాన్ మస్క్‌ను సారథిగా నియమించారు. ప్రభుత్వ వ్యవస్థలో మార్పులు, ఆయా శాఖల్లో వృథా ఖర్చులు తగ్గించడమే దీని లక్ష్యం అని ట్రంప్ ప్రకటించారు. ఈ క్రమంలో వివిధ విభాగాల్లోని వేలాది మంది ఉద్యోగులను తొలగించే ప్రక్రియను చేపట్టారు. అలాగే, అమెరికా నుంచి వివిధ దేశాలకు అందుతోన్న సాయంలోనూ కోతలు పెట్టారు. ఈ క్రమంలో మస్క్ పనితీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ట్రంప్ యంత్రాంగాన్ని ఎలాన్ మస్క్ వెనకుండి నడిపిస్తున్నారని, షాడో అధ్యక్షుడిగా మారిపోయారని ఆరోపణలు వచ్చాయి. దీంతో స్పందించిన శ్వేతసౌధం 'డోజ్‌లో మస్క్ ఉద్యోగి కాదు. ఆయనకు ఎటువంటి నిర్ణయాధికారాలూ లేవు' అని తెలిపింది. ఆయన ట్రంప్ సలహాదారుడిగా మాత్రమే బాధ్యతలు చూస్తున్నారని వైట్‌హౌస్ స్పష్టం చేసింది. ఈ క్రమంలో మస్క్ తన బాధ్యతల నుంచి వైదొలగనుండటం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయాన్ని ట్రంప్ తన ముగ్గురు సన్నిహితులతో పాటు క్యాబినెట్‌కు చెప్పినట్లు సమాచారం. దీనికి సంబంధించి అంతర్జాతీయ మీడియాలో పలు కథనాలు వస్తున్నాయి. మస్క్ నిష్క్రమణతో ట్రంప్ ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేస్తుందో చూడాలి. అయితే, ఈ పరిణామాలకు ముందు విస్కాన్సిన్‌లో జరిగిన ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్‌లకు గట్టి షాక్ తగిలింది. రిపబ్లికన్లు లక్షల డాలర్లు ఖర్చుచేసినా.. విస్కాన్సిన్‌లోని సుప్రీంకోర్టు సీటును డెమొక్రాట్ మద్దతుదారు గెలుచుకున్నారు. విస్కాన్సిన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవికి కౌంటీ జడ్జీలు సుసాన్ క్రాఫర్డ్ (డెమొక్రాట్లు మద్దతుదారు), బ్రాడ్ షీమెల్ (రిపబ్లికన్ మద్దతుదారు) పోటీ చేశారు. ఈ ఎన్నిక కోసం మస్క్ మొత్తం 21 మిలియన్ డాలర్లు ఖర్చుచేసినా లాభం లేకపోయింది. ఏప్రిల్ 1న జరిగిన ఎన్నికల్లో డేన్ కౌంటీ జడ్జి క్రాఫర్డ్ ఘన విజయం సాధించారు. ట్రంప్ పాలసీలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా అమలు చేయాలంటే సుప్రీంకోర్టు తమకు అనుకూలంగా ఉండాలని మస్క్ భావించి.. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ప్రయత్నించారు. డబ్బులను మంచినీళ్లలా ఖర్చు చేసినా.. ఓటర్లు ఆయనకు షాకిచ్చారు. ఇది కూడా డోజ్ నుంచి మస్క్‌ను తప్పించడానికి బలమైన కారణంగా భావిస్తున్నారు. దీంతోపాటుగా ఉద్యోగులకు ఫిబ్రవరిలో మస్క్ పంపిన మెయిల్ కూడా తీవ్ర దుమారం రేపింది.



## విజృంభిస్తున్న బర్డ్ ఫ్లూ..
### హైదరాబాద్ శివారు ప్రాంతంలో వేలాది కోళ్లు మృత్యువాత


తెలంగాణలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి మళ్లీ పెరుగుతోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూ బారినపడి వేలాది కోళ్లు మృత్యువాత పడుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెంట్ మండలంలోనూ బర్డ్ ఫ్లూ కలకలం చోటు చేసుకుంది. ఓ ఫౌల్ట్రీ ఫామ్ లో వేలాది కోళ్లు మృత్యువాత పడ్డాయి.గత నాలుగు రోజుల క్రితం నగర శివారులోని ఓ ఫౌల్ట్రీలో వేల సంఖ్యలో కోళ్లు చనిపోయాయి. అధికారులు చనిపోయిన కోళ్ల నుంచి శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపించారు. బర్డ్ ఫ్లూ అని అధికారులు నివేదిక ఇవ్వడంతో పౌల్ట్రీ ఫామ్ యాజమానులు ఆందోళన చెందుతున్నారు. కోట్లలో ఆస్తి నష్టం సంభవిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, మరోసారి అదే ప్రాంతంలోని ఫౌల్ట్రీ ఫామ్ లలో అధికారులు మరోసారి శాంపిల్స్ ను సేకరించారు. కోళ్లు కానీ, కోడిగుడ్లను కానీ అమ్మొద్దని పౌల్ట్రీ యాజమానులను అధికారులు ఆదేశించారు. హైదరాబాద్ లోని అధిక శాతం చికెన్ దుకాణాలకు కోళ్లు, కోడి గుడ్లు నగర శివార్లలోని, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఫౌల్ట్రీ ఫామ్ ల నుంచి సరఫరా అవుతుంటాయి. ప్రస్తుతం నగర శివార్లలోని ఫౌల్ట్రీ ఫామ్ లో బర్డ్ ఫ్లూ కలకలం రేగడంతోపాటు.. పలు ఫామ్ లలోని కోళ్లు బర్డ్ ఫ్లూ కారణంగానే మరణించినట్లు నిర్ధారణ కావడంతో నగరంలోని చికెన్ ప్రియులు భయాందోళన చెందుతున్నారు.

# డొనాల్డ్ ట్రంప్ గోల్డ్ కార్డ్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే గోల్డ్ కార్డు ఆఫర్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఉన్న పెట్టుబడి వీసా ఈబీ-5 స్థానంలో గోల్డ్ కార్డు తీసుకురానున్నట్లు వెల్లడించారు. 5 మిలియన్ డాలర్లు (సుమారు 44 కోట్లు) చెల్లించగలిగే వారికి నేరుగా అమెరికా పౌరసత్వాన్ని ఇవ్వనున్నారు. ట్రంప్ ప్రకటించిన ఈ గోల్డ్ కార్డుకు అమెరికాలో భారీ గిరాకీ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా గోల్డ్ కార్డుకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను అధ్యక్షుడు విడుదల చేశారు. ట్రంప్ చిత్రంతో ఉన్న ఈ గోల్డ్ కార్డును ఎయిర్ ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడే సమయంలో చూపించారు. ఈ గోల్డ్ కార్డును 5 మిలియన్ డాలర్లు చెల్లించి ఎవరైనా సొంతం చేసుకోవచ్చని తెలిపారు. అంతేకాదు ఈ గోల్డ్ కార్డును తానే మొదట కొనుగోలు చేసినట్లు ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రకటించారు. రెండో కొనుగోలుదారు ఎవరో తనకు తెలియదని చెప్పారు. ఈ గోల్డ్ కార్డు రెండు వారాల్లో అమ్ముడయిపోతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. పౌరసత్వ కార్డుల ద్వారా వేగంగా జాతీయ ఆర్థిక సంక్షోభాన్ని కొంత వరకు తగ్గించవచ్చు అన్న అభిప్రాయంలో ట్రంప్ ఉన్నారు. ఈ క్రమంలో ఈబీ-5 ఇమ్మిగ్రెంట్ ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ స్థానంలో గోల్డ్ కార్డు ఆఫర్లను ప్రకటించారు. ఈబీ-5 ప్రోగ్రామ్ ద్వారా అమెరికాలో పెట్టుబడి పెట్టే విదేశీయులకు గ్రీన్ కార్డు ఇస్తారు. గోల్డ్ కార్డులను అమ్మనున్నామని, 5 మిలియన్ల డాలర్లకే ఆ కార్డును ఇవ్వనున్నట్లు ట్రంప్ ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించారు. ట్రంప్ ప్రకటనతో ఈ గోల్డ్ కార్డులకు భారీ గిరాకీ ఉన్నట్లు తెలుస్తోంది.






## 'పెద్ది' దర్శకునికి గ్లోబల్ స్టార్ దంపతులు సర్ప్రైజ్!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా ఇపుడు నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రమే "పెద్ది". బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్ గా చేస్తున్న ఈ సినిమా పట్ల మెగా అభిమానుల్లో గట్టి అంచనాలు ఉన్నాయి. రీసెంట్ గా వచ్చిన టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్స్ మంచి అంచనాలు పెంచగా ఇపుడు పెద్ది గ్లింప్స్ కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ నేపథ్యంలో దర్శకుడు బుచ్చిబాబు సానాకి గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ అలాగే తన భార్య ఉపాసనలు ఇచ్చిన ఒక డివోషనల్ సర్ప్రైజ్ ని బుచ్చిబాబు షేర్ చేసుకొని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హనుమాన్ పై పాదుకలు అలాగే మరికొన్ని పుస్తకాలని బహుమతిగా పంపిన పిక్స్ ని షేర్ చేసుకొని బుచ్చిబాబు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనితో ఈ పోస్ట్ సహా పిక్స్ వైరల్ గా మారాయి. ఇక ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా వృద్ధి సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

## లక్ష్మీ రాయ్ బికినీ వేస్తే ఆ కిక్కే వేరబ్బా

హీరోయిన్ లక్ష్మి రాయ్..ఈ పేరు తెలియని సినిమా అభిమాని ఉండరంటే అతిశేయోక్తి కాదు. చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ, మంచి గుర్తింపు దక్కించుకుంది. తన అందం, అభినయంతో ప్రేక్షకులను మంత్రముగ్దులను చేస్తోంది ఈ హాట్ బ్యూటీ. కర్ణాటకలో జన్మించిన ఈ భామ తమిళం, మలయాళం, కన్నడ భాషలలోనూ అనేక చిత్రాల్లో నటించింది. తెలుగులో ముఖ్యంగా ఐటెం సాంగ్స్‌తో మంచి గుర్తింపు తెచ్చుకుంది. కాంచనమాల కేబుల్ టీవి అనే సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచియం అయింది.సర్దార్ గబ్బర్ సింగ్, ఖైదీ నెం 150 సినిమాలతో మెగా హీరోల సినిమాల్లో ఐటెం సాంగ్స్‌తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది.ప్రస్తుతం లక్ష్మి రాయ్ తెలుగు, తమిళం, హిందీ భాషలలో అనేక చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. త్వరలోనే ఈమె నటించిన కొన్ని కొత్త చిత్రాలు విడుదల కానున్నాయి. హీరోయిన్‌గా, ఐటెం సాంగ్స్‌లో, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అనేక రకాల పాత్రలు చేసి తన ప్రతిభను చాటుకుంది.తన అందంతో ప్రేక్షకులను అలరిస్తూ, అనేక ఫ్యాషన్ మ్యాగజైన్‌లకు ఫోటోషూట్‌లు చేసింది. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటూ తన ఫ్యాన్స్‌తో కనెక్ట్ అవుతుంది.

## 40 గంటలుగా తుర్కియే ఎయిర్‌పోర్ట్‌లోనే..
## వసతుల లేమితో భారతీయ ప్రయాణికుల అవస్థలు



200 మందికిపైగా భారతీయ ప్రయాణికులతో లండన్ నుంచి ముంబైకి బయల్దేరిన విమానం తుర్కియేలో అత్యవసరంగా ల్యాండ్ అయిన విషయం తెలిసిందే. గురువారం వర్జిన్ అట్లాంటిక్ విమానం వైద్య అత్యవసర పరిస్థితి కారణంగా తుర్కియేలోని మారుమూల 'దియార్ బకిర్' విమానాశ్రయంలో ల్యాండింగ్ జరపాల్సి వచ్చింది. అయితే, విమానం ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయ్యి కొన్ని గంటలు గడుస్తున్నా తిరుగు ప్రయాణంపై స్పష్టత రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దాదాపు 40 గంటలుగా విమానాశ్రయంలోనే పడిగాపులు కాస్తున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. అక్కడ వసతి సహా ఇతర ఏర్పాట్లేవీ లేవని, తమ ప్రయాణం ఎప్పుడన్నది అధికారులు చెప్పటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆహారం కూడా లేదని, 250 మందికి ఒకే ఒక్క టాయిలెట్ ఉందని చెప్పారు. చలిని తట్టుకోవడానికి కనీసం దుప్పట్లు కూడా ఇవ్వలేదని మండిపడుతున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ పోస్టులు పెడుతున్నారు.మరోవైపు ప్రయాణికుల ఆందోళన నేపథ్యంలో వర్జిన్ అట్లాంటిక్ ఎయిర్‌లైన్స్ స్పందించింది. విమానంలో సాంకేతిక లోపం కారణంగా అత్యవసరంగా తుర్కియేలో ల్యాండ్ చేయాల్సి వచ్చిందని పేర్కొంది. ప్రయాణికులు, సిబ్బంది భద్రతే తమకు ముఖ్యమని చెప్పింది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# హోమ్ టౌన్ రివ్యూ





మన తెలుగు ఓటిటి యాప్ 'ఆహా'లో లేటెస్ట్ గా రిలీజ్ కి వచ్చిన వెబ్ సిరీస్ "హోమ్ టౌన్". రాజీవ్ కనకాల అలాగే ఝాన్సీ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించిన ఈ సిరీస్ ని 90స్ బయోపిక్ మేకర్స్ తెరకెక్కించడం జరిగింది. మరి ఈ సిరీస్ ఎలా ఉందో రివ్యూలో చూద్దాం రండి. ఈ సిరీస్ 2003 సమయం నుంచి తెలంగాణ హన్మంతుల గూడెం అనే చిన్న గ్రామంలో కనిపిస్తుంది. ఒక ఫోటో స్టూడియోతో తన మిడిల్ క్లాస్ లైఫ్ ని ప్రసాద్ (రాజీవ్ కనకాల) తన భార్య (ఝాన్సీ) అలాగే పిల్లలు శ్రీకాంత్ (ప్రజ్వల్ యద్మ) అలాగే తన చెల్లెలు జ్యోతి (ఆనీ) లని వచ్చే తక్కువపాటి మొత్తం తోనే లీడ్ చేస్తారు. అయితే శ్రీకాంత్ కి సరిగా చదువు ఎక్కదు కానీ కూతురు మాత్రం బాగా చదువుతుంది. అయితే వీరి అందరి నడుమ డ్రామా ఎలా సాగింది? ఎవరు ఏం చేశారు? ప్రసాద్ కోరుకున్నట్టుగా తన కొడుకు విదేశాలకి వెళ్తాడా లేదా? శ్రీకాంత్ ఏమవ్వాలి అనుకుంటాడు? తన చెల్లెలు విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడు అనేది ఈ సిరీస్ లో అసలు కథ. ఇటీవల 90స్ నేపథ్యంలో వచ్చిన పలు సినిమాలు, సిరీస్ తరహాలోనే దీనిలో కూడా కొన్ని మూమెంట్స్ 90స్ కిడ్స్ బాగా కనెక్ట్ అవుతాయి. అప్పటి కొన్ని కొన్ని సన్నివేశాలు అలాగే ఎమోషన్స్ ఈ సిరీస్ లో ఆకట్టుకుంటాయి అని చెప్పవచ్చు. మెయిన్ గా మొదటి మూడు ఎపిసోడ్స్ డీసెంట్ గా సాగాయి అని చెప్పవచ్చు. ఈ మూడింటిలో కూడా రెండో ఎపిసోడ్ మాత్రం మంచి హిలేరియస్ గా సాగుతుంది. ప్రతీ ఎపిసోడ్ లో డీసెంట్ ఎమోషనల్ ఎండింగ్ ఓకే అనిపిస్తుంది. ఇక నటీనటుల్లో ముగ్గురు యువ నటులు ప్రజ్వల్, సాయి రామ్ అలాగే అనిరుద్ లు చాలా బాగా చేశారు. మెయిన్ గా వీరి ముగ్గురు మధ్య నడిచే కామెడీ సీన్స్ అన్నీ బాగున్నాయని చెప్పవచ్చు. ముగ్గురులో కూడా సాయి రామ్ పై కామెడీ భలే అనిపిస్తాయి. అంతే కాకుండా ఆ రోల్ ని యువ నటుడు బాగా రక్తి కట్టించాడు. ఇక ప్రజ్వల్ నీట్ పెర్ఫామెన్స్ ని అందించాడు. పలు ఎమోషనల్ సీన్స్ ని బాగా చేసాడు. ఇక వీరితో పాటుగా సీనియర్ నటులు రాజీవ్ కనకాల, ఝాన్సీలు తమ అనుభవాన్ని తమ పాత్రల్లో చూపించారు. మధ్య తరగతి కుటుంబ తల్లిదండ్రుల్లా తమ పిల్లల కోసం వారి భవిష్యత్తు కోసం తాపత్రయం పడే ఇనోసెంట్ తల్లిదండ్రుల్లా చాలా బాగా చేశారు. అలానే యువ నటి ఆనీ తన పాత్రలో బాగా చేసింది. కొన్ని సన్నివేశాలు ఫ్లోలో వెళతాయి కానీ అందులో ఆమెపై ఎమోషనల్ సీన్స్ బాగున్నాయి. అలానే క్లైమాక్స్ లో చిన్న ఎమోషనల్ బిట్ తనపై బాగుంది. ఈ సిరీస్ ని కూడా 90స్ కాంపౌండ్ వారే తీసుకురావడం ఓకే కానీ ఇది వరకు ఆ 90స్ బయోపిక్ సహా కమిటీ కుర్రోళ్ళు లాంటివి చూసిన వారికి ఒకింత రొటీన్ గానే అనిపిస్తుంది. అలాగే ఈ సిరీస్ లో కేవలం 5 ఎపిసోడ్స్ మాత్రమే అందులోని నిడివి కూడా తక్కువగానే ప్లాన్ చేసినప్పటికీ అన్ని ఎపిసోడ్స్ కూడా అంత ఎఫెక్టివ్ గా అనిపించవు. మెయిన్ గా ఆ ముందు సిరీస్, సినిమాల ప్రభావమో ఏమో కానీ వాటి ఎఫెక్ట్ మాత్రం ఇందులో కనిపించడం బాగా రొటీన్ గా అనిపిస్తుంది. అలాగే లస్ట్ ఎపిసోడ్ కొంతమేర ఫ్యామిలీ ఆడియెన్స్ కి ఇబ్బందిగా ఉండొచ్చు. ఇక నాలుగో ఎపిసోడ్ ఫేస్ బుక్ ఎపిసోడ్ కేవలం ఆ ఎపిసోడ్ వరకు ఓకే కానీ అది మాత్రం బాగా ల్యాగ్ అనిపిస్తుంది. దీనిని స్టార్టింగ్ లోనే సెటప్ చేసి ఉంటే బాగుండు లేదా చిన్నగా కుదించాల్సింది. ఇది అప్పటి వరకు ఉన్న ఫ్లోని దెబ్బ తీసినట్టు అనిపిస్తుంది. అలాగే సిరీస్ లో ఇద్దరు అన్నా చెల్లెల్లో లేదా అక్కా తమ్ముళ్ళో ఒకే క్లాస్ లో ఎలా చదువుతారు అనే లాజిక్ కూడా కరెక్ట్ గా అనిపించదు. అలాగే క్లైమాక్స్ పోర్షన్ లో రాజీవ్ కనకాల ప్రజ్వల్ నడుమ ఎమోషనల్ సంభాషణలు కొత్తగా ఏమన్నా ట్రై చేయాల్సింది. ఈ సిరీస్ లో నిర్మాణ విలువలు బాగున్నాయి. మెయిన్ గా 2003 సమయం నుంచి అట్మాస్పియర్ ని బాగా రీక్రియేట్ చేశారు. ఈ పరంగా నిర్మాణ విలువలు సెటప్ అంతా బాగుంది. సురేష్ బొబ్బిలి మ్యూజిక్ ఓకే. దేవ్ దీప్ గాంధీ కుందు సినిమాటోగ్రఫీ బాగుంది. పాత రోజులు గుర్తు చేసేలా మంచి విజువల్స్ ని కెమెరాతో బంధించారు. అలాగే కార్తీక్ ఎడిటింగ్ ఇంకొంచెం బెటర్ గా ట్రై చేసి ఉంటే బాగుండేది. ఇక దర్శకుడు శ్రీకాంత్ రెడ్డి పల్లె విషయానికి వస్తే.. తాను తన బయోపిక్ నే ఈ సిరీస్ లా తీసుకున్నారు కావచ్చు ఏమో కానీ చాలా వరకు ఓకే కానీ కొన్ని అంశాలు మాత్రం ఈ సిరీస్ లో కొంచెం డల్ గా సాగాయి. అలాగే కొన్ని సీన్స్ రొటీన్ గానే అనిపిస్తాయి. నటీనటుల నుంచి మంచి పెర్ఫామెన్స్ లని తాను రాబట్టుకున్నారు కానీ కథనం విషయంలో మాత్రం ఇంకా దృష్టి పెట్టాల్సింది. ఇక మొత్తంగా చూసినట్టు అయితే ఈ 'హోమ్ టౌన్' సిరీస్ నోస్టాలజీ అంశాలని ఇష్టపడేవారికి డీసెంట్ గా అనిపిస్తుంది. మెయిన్ గా హిలేరియస్ సీన్స్ ఈ సిరీస్ లో బాగా వర్కౌట్ అయ్యాయి అని చెప్పవచ్చు. నాలుగో ఎపిసోడ్ మినహా మిగతా అంతా పర్వాలేదు అనిపిస్తుంది.



## చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా షర్మిల పనిచేస్తుంది

వైయస్ వివేకానందరెడ్డిని తామే చంపామని టీవీ ప్రత్యక్ష ప్రసారాల్లో చెప్పకున్న అసలు హంతకులను అప్రూవర్లుగా మార్చి, వారికి బెయిల్ వచ్చేలా చేసి, వారిని నిరంతరం కాపాడుతూ, ఇప్పుడు వారినే హీరోలుగా చూపిస్తున్నారని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఈ కేసులో నిర్దోషులను బలిచేయాలన్న ఆరాటం ఎందుకు? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కాంగ్రెస్ నాయకురాల షర్మిలపై మాజీ మంత్రి రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా 'షర్మిళ ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన విషయాలు చూశాం. ఒకరిపై అసూయ, ద్వేషంతో చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారి రాజకీయాలు చేసే వారు గొప్పగా ప్రసంగిస్తారని ఎలా అనుకోవాలి?. వివేకాను తామే చంపామని టీవీ ప్రత్యక్ష ప్రసారాల్లో తమతో తాముగా చెప్పకున్న అసలు హంతకులను అప్రూవర్లుగా మార్చి, వారికి బెయిల్ వచ్చేలా చేసి, వారిని నిరంతరం కాపాడుతూ, ఇప్పుడు వారినే హీరోలుగా చూపిస్తున్నారు. ఒకప్పుడు వేల రూపాయలకూ అప్పులు చేసిన వారు ఇప్పుడు లక్షాధికారులు అయ్యారు, ఇది ప్రజలందరికీ స్పష్టంగా కనిపిస్తోంది షర్మిల.వివేకా హత్య జరిగినప్పుడు అధికారంలో చంద్రబాబే ఉన్నారు. ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించమన్నదీ, విచారణను పక్క రాష్ట్రానికి మార్చమన్నదీ మీరే. ఇప్పుడు అధికారంలో మీ చంద్రబాబే ఉన్నా, ఏడుపు మాత్రం మీదే. నిర్దోషులను బలిచేయాలన్న ఆరాటం ఎందుకు?. చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం రూపొందించిన కుట్రలో మీరు ఓ సాధనంగా మారిన మాట వాస్తవం కాదా, షర్మిళ ? దీని భాగంగానే మీరు నిర్దోషులపై బురదజల్లుతూ తప్పడు ఆరోపణలు చేస్తున్నారు. చంద్రబాబుకు మేలు చేయాలన్న మీ తాపత్రయం, మీ లక్ష్యం, మీ ఉద్దేశం ప్రజలకు పూర్తిగా అర్థమవుతోంది. చివరికి, మీ అన్నగారిని ఇబ్బందిపెట్టడమే మీ అసలు గమ్యం. బాబు కక్ష రాజకీయాల్లో మీరు మరో కోణంగా మారిన విధానం ప్రజలు గమనిస్తున్నారు అంటూ రోజా ఘాటు విమర్శలు చేశారు.




### IPL 2025లో సాయి సుదర్శన్

## స్కోరింగ్ సంచలనం

ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ జట్టు తరపున ఆడుతున్న సాయి సుదర్శన్ తనదైన ఆటతీరుతో అలరిస్తున్నాడు. స్ట్రాంగ్ బ్యాట్స్‌మెన్‌గా రాణించడంతో పాటు పరుగుల వరద కురిపిస్తూ జట్టు విజయాల్లో కీలకంగా మారుతున్నాడు. మరి ఈ ప్లేయర్ ఆటతీరు ఎలా ఉందో ఓసారి ఈ విశ్లేణలో చూద్దామా.

- బ్యాటింగ్ స్కోర్: సాయి సుదర్శన్ IPL 2025లో ఇప్పటివరకు 137 పరుగులు చేశాడు. అద్భుతమైన 68.50 సగటు, 167.07 స్ట్రైక్ రేట్‌తో దూసుకుపోతున్నాడు. ఈ సీజన్‌లో అతని అత్యుత్తమ స్కోరు 74 (41) పంజాబ్ కింగ్స్ (PBKS)పై సాధించాడు. ఎఫెక్టివ్ ఇన్నింగ్స్ ఆడగలనని అతని నిరూపించుకున్నాడు.
- ప్రధాన ఇన్నింగ్స్‌లు: అతని గుర్తించదగిన ప్రదర్శనలలో 74 (41) vs PBKS, 63 (41) vs ముంబై ఇండియన్స్ (MI), 49 (36) vs రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) ఉన్నాయి. MIపై 63 పరుగులు GTకి 36 పరుగుల తేడాతో విజయాన్ని అందించడంలో కీలకమైనవి. అదే సమయంలో PBKSపై 74 పరుగులు 180.49 స్ట్రైక్ రేట్‌తో అతని వేగవంతమైన స్కోరింగ్ సామర్థ్యాన్ని చూపించాయి.
- పవర్‌ప్లే ఆధిపత్యం: సుదర్శన్ IPL చరిత్రలో అత్యధిక పవర్‌ప్లే బ్యాటింగ్ సగటు 110తో రికార్డు సృష్టించాడు. 22 పవర్‌ప్లే ఇన్నింగ్స్‌లలో కేవలం 3 సార్లు మాత్రమే ఔట్ అయ్యాడు. 2025లో, అతను పవర్‌ప్లేలో వేగంగా స్కోరు చేయడం (స్ట్రైక్ రేట్ 167.07) GTకి బలమైన ఆరంభాలను అందించింది. MI ఆటలో శుభ్‌మన్ గిల్‌తో 78 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యంలో చూడవచ్చు.
- గుజరాత్ టైటాన్స్‌లో కీలకం: గిల్‌తో పాటు ఓపెనర్‌గా, సుదర్శన్ ఇన్నింగ్స్‌ను నడిపించే యాంకర్ పాత్ర పోషిస్తున్నాడు. అవసరమైనప్పుడు వేగం పెంచగలడు. అతని స్థిరత్వం (గత ఏడు IPL ఇన్నింగ్స్‌లలో 49 కంటే తక్కువ స్కోరు లేదు) అతన్ని GTకి నమ్మకమైన టాప్-ఆర్డర్ బ్యాట్స్‌మన్‌గా చేసింది. మిడిల్ ఆర్డర్‌కు బలమైన పునాది వేస్తున్నాడు.
- మెరుగుపరచుకోవాల్సిన అంశాలు: స్థిరత్వం ఉన్నప్పటికీ, సుదర్శన్ మరిన్ని స్టార్ట్‌లను పెద్ద స్కోర్‌లుగా మార్చాలి. RCBపై 49 (స్ట్రైక్ రేట్ 136.11, సీజన్ సగటు కంటే తక్కువ)లో చూసినట్లు. స్పిన్-హెవీ దాడులపై స్కోరింగ్ రేట్‌ను మెరుగుపరిస్తే అతడు తన ఆటను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లవచ్చు.




## మత్తెక్కిస్తున్న వామిక ఫొటోస్

సోషల్ మీడియాలో ఎవరు ఎప్పుడు ట్రెండ్ అవుతారో చెప్పలేం. అలా ఈ హాట్ బ్యూటీ ఇప్పుడు యమా ట్రెండింగ్ అవుతోంది. ఈ బ్యూటీ ఓరకంటతో చూస్తున్న ఫోటోలు నెట్టింట తెగ ట్రెండ్ అవుతోంది. ఇంతకీ ఆమె ఎవరా అని అనుకుంటున్నారా.!కేవలం ఒకే ఒక్క తెలుగు సినిమా చేసిన ఈమె మరెవరో కాదు.. వామికా గబ్బి. సుధీర్ బాబు హీరోగా తెరకెక్కిన 'భలే మంచి రోజు' సినిమాతో టాలీవుడ్‌కి పరిచయమైంది. ఈ మూవీ కమర్షియల్‌గా ఫెయిల్ కావడంతో వామికా మళ్లీ తెలుగులో మరే చిత్రంలో నటించలేదు.పంజాబీ, హిందీ, మలయాళం, తెలుగు సినిమాల్లో నటించింది వామికా గబ్బి. 2007లో 'జబ్ వి మెట్' సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి వచ్చినా.. ఇప్పటివరకు ఈ బ్యూటీకి సరైన బ్రేక్ దక్కలేదు.2023లో 'ఖుఫియా' అనే హిందీ సినిమాతో వామికా బాగా ఫేమస్ అయింది. ఈ చిత్రంలో ఆమె నటించిన బోల్డ్ సీన్స్ సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అయ్యాయి. దాంతో ఈ బ్యూటీకి క్రేజ్ కూడా డబుల్ అయ్యింది. తాజాగా వరుణ్ ధావన్ హీరోగా వచ్చిన 'బేబీ జాన్' మూవీతో ప్రేక్షకులను పలకరించింది.

## వక్ఫ్ బిల్లు ఆమోదం చారిత్రాత్మకం: పవన్ కళ్యాణ్

వక్ఫ్ బిల్లు ఆమోదం చారిత్రాత్మకం అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. వక్ఫ్‌బోర్డు కార్యకలాపాలపై ఎప్పటి నుంచో ఆందోళనలు జరుగుతుండగా.. తాజా సవరణతో పేద ముస్లింలకు న్యాయం జరుగుతుందని పవన్ తెలిపారు. మోదీ నాయకత్వంలో దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం లభించిందని, ప్రతిపక్షాల అభిప్రాయాన్ని గౌరవిస్తూ చర్చ జరిపిన తీరు ప్రజాస్వామ్యానికి నిదర్శనం అని కొనియాడారు. దేవుని ఆస్తి దోచుకోవడం నేరమే కాదు, మోసం చేయటమే పేర్కొన్నారు.





### కేరళ సీఎం విజయన్ కుమార్తెపై ఆర్థిక నేరం కేసులో

## విచారణకు కేంద్రం అనుమతి

కేరళ సీఎం పినరయి విజయన్ కుమార్తె టీ వీణా విజయన్ చిక్కుల్లో పడ్డారు. ఆర్థిక నేరం కేసులో ఆమెను విచారించేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. న్యాయ విచారణ చేపట్టేందుకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఆ ఆదేశాలు జారీ చేసింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ కంపెనీ నుంచి వీణా విజయన్‌కు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ కంపెనీకి అక్రమ రీతిలో డబ్బులు బదిలీ అయినట్లు తేలింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్ ఆధారంగా కేసు విచారణకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. కొచ్చిలోని ఆర్థిక నేరాలను పరిశీలించే ప్రత్యేక కోర్టులో ఈ కేసు ఫైల్ అయ్యింది. సీఎంఆర్ఎల్, ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ మధ్య అక్రమ రీతిలో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు అనుమానించారు. 2017 నుంచి 2020 మధ్య కాలంలో సీఎంఆర్ఎల్ కంపెనీ నుంచి వీణా విజయన్‌కు చెందిన కంపెనీ సుమారు 1.72 కోట్లు బదిలీ అయ్యాయి. దీంతో ఈకేసులో విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐఓ ఆదేశాలు జారీ చేసింది.

## ఏపీ సచివాలయంలో అగ్నిప్రమాదం..!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సచివాలయంలో రెండో బ్లాక్‌లో బ్యాటరీలు ఉంచే ప్రాంతంలో మంటలు చెలరేగినట్లు సమాచరం. వెంటనే ఎస్పీఎఫ్ సిబ్బంది ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కాగా ప్రమాదానికి గల కారణాలపై భద్రతా సిబ్బంది దర్యాప్తు చేపట్టారు.రెండో బ్లాక్‌లోనే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, టూరిజం మంత్రి కందుల దుర్గేష్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, హోం మంత్రి వంగలపూడి అనిత పేషీలు ఉన్నాయి. తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరగడంతో సిబ్బంది ఎవరూ కార్యాలయం లోపల లేరని సమాచారం. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

